క్లుప్తంగా

ఆర్థిక సహాయం



బాధితురాలికి నగదు డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: ఆకులపేట గ్రామానికి చెందిన పతివాడ రమణ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి అమెరికాలో ఉంటున్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాడివాక బిందు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నగదును మృతుడి భార్య రమ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. సంబంధిత డిపాజిట్ పత్రాలను ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మృతుడి భార్యకు ఆదివారం అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

గంట్యాడ: రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై సురేంద్రనాయుడు కోరారు. మండలంలోని కొఠారుబిల్లి కూడలి వద్ద ఆటో డ్రైవర్లకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదన్నారు. ముందు సీట్లలో ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు.

పశువుల వ్యాన్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేట్ వద్ద పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష తెలిపారు. రామభద్రపురం నుంచి వైజాగ్‌కు ఏడు పశువులను తరలిస్తుండగా.. పట్టుకున్నామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్టర్ వేడుకలు



ఏసుక్రీస్తు సందేశాన్ని వివరిస్తున్న పాస్టర్ సాగర్‌బాబు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ఈస్టర్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు.పాస్టర్ సాగర్ బాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుంచిఆదివారం ఉదయం వరకు ప్రార్థనలు చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



గొల్లుపాలెంలో వీధి కాలువలను పరిశీలిస్తున్న ఎంపీడీఓహరిహరరావు

బొండపల్లి: గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటితో పాటు,పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో వీధి కాలువలను, తాగునీటి వనరులను ఆదివారం ఆయన పరిశీలించారు. తరచూ గ్రామాలను సందర్శించి సమస్యలు ఎక్కడ ఉన్నా స్పందించి, పరిష్కరించాలని తన వెంట ఉన్న సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ సూచించారు.

చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిద్దాం..

- బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం,అభివృద్ధిని గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించి, వారి మద్దతు కోరాలని బూత్ కమిటీ సభ్యులు, నాయకులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. అలమండ గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గానికి ఇన్నాళ్లకు రాజకీయ స్థిరత్వం వచ్చిందన్నారు. విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసారి తనకు అవకాశం ఇవ్వడంతో రాజకీయస్థిరత్వం వచ్చిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా మంత్రి బొత్స, ఎంపీ అభ్యర్థి ఝాన్సీ లక్ష్మి ,తాను అందుబాటులో ఉంటామన్నారు. పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ విజయానికి నాయకులు అంతా కలిసికట్టుగా పని చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ కోట పాపమ్మ,ఉప సర్పంచ్ లగుడు దేముడు, జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, నాయకులు అల్లు అవినాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యం



రెల్లిలో సచివాలయం,వెల్‌నెస్ కేంద్రం, ఆర్బీకే భవనాల సముదాయం

- ప్రగతి పథంలో రెల్లి సచివాలయం పరిధి గ్రామాలు
- రూ.2.21 కోట్లతో అభివృద్ధి పనులు
- ఇళ్ల స్థలాలు, నిర్మాణాల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.1.82 కోట్లు
- ప్రత్యక్ష నగదు బదిలీ విధానం(డీబీటీ)లో పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి: రూ.12.20 కోట్లు
- పథకాల ద్వారా పరోక్షంగా (నాన్ డీబీటీ) ప్రజలకు చేకూరిన లబ్ధి: రూ.4.27 కోట్లు

కొత్తవలస: మండలంలోని రెల్లి సచివాలయం పరిధి గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. కులం చూడం,మతం చూడం,పార్టీలు చూడం, అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం.. గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలకు రెల్లి సచివాలయం పరిధి గ్రామాలు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రెల్లి, అప్పన్న దొరపాలెం పంచా యతీలను కలిపి రెల్లి కేంద్రంగా సచివాలయం ఏర్పాటు చేశారు. రెల్లి పంచాయతీలో ముమ్మనవానిపాలెం, అప్పన్నదొరపాలెంలో తమ్మన్నమెరక, చిన్నమణి పాలెం, జోడుమెరక గ్రామాలు కలవు. ఈ సచివాలయం పరిధిలో 2,459 మంది జనాభా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గిరి జనులే. గత ప్రభత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రెల్లి, అప్పన్న దొరపాలెం పంచాయతీలు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి నోచుకున్నాయి. రెల్లి గ్రామంలో సుమారు రూ.38 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.28 లక్షల తో రైతు భరోసా కేంద్రం భవనం, రూ.23 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ కేంద్రం భవనాలను నిర్మించారు. నాడు–నేడులో భాగంగా అప్పన్నదొరపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు రూ.67 లక్షలతో అదనపు భవనం నిర్మాణంతో పాటు ఆధునికీకరణ పనుల చేసి, మౌలిక సదు పాయాలు మెరుగుపరిచారు. సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15.75 లక్షలతో సుమారు 1.3 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, కాలు వలు నిర్మించారు. జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేసి సచివాలయం పరిధిలో 74 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఇందు కోసం ప్రభుత్వం రూ.1.82 కోట్లు ఖర్చు చేసింది. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ముమ్మనవానిపాలెం గ్రామంలో 20 వేల లీటర్లు, జోడుమెరకలో 10 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్‌లను సుమారు రూ.30 లక్షలతో నిర్మించారు. రెల్లి గ్రామం నుంచి ఇతర గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.20లక్షలతో మెటల్ రోడ్లు నిర్మించారు. మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని లేకుండా ప్రభుత్వ సేవలన్నీ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్నాయి.



అప్పన్నదొరపాలెంలో గిరిజనుల ఇళ్ల వద్ద నిర్మించిన సీసీ రోడ్డు



నాడు-నేడులో భాగంగా అభివృద్ధి చెందిన అప్పన్నదొరపాలెం యూపీ స్కూల్



అప్పన్నదొరపాలెం యూపీ స్కూల్‌లో నాడు-నేడులో భాగంగా సమకూర్చిన బెంచీలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు



రెల్లి నుంచి ముమ్మనవానిపాలెం గ్రామానికి నిర్మించిన మెటల్ రోడ్డు



ముమ్మనవానిపాలెంలో నిర్మించిన తాగునీటి ట్యాంకు



రెల్లి గ్రామంలో నిర్మించిన సీసీ కాలువలు

సచివాలయం పరిధిలో పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలు		
పథకం	లబ్ధిదారులు	నగదు
జగనన్న అమ్మఒడి	292	రూ.13,81,4,300
జగనన్న విద్యాదీవెన	171	రూ.39,34,972
జగనన్న వసతిదీవెన	134	రూ.23,09,896
రైతు భరోసా	411	రూ.15,61,11,000
ఉచిత పంటల బీమా	49	రూ 42,502
సున్నా వడ్డీ పంట రుణాలు	38	రూ.58,983
వైఎస్సార్ పెన్షన్ కానుక	481	రూ.4,56,04,000
వైఎస్సార్ చేయూత	172	రూ.81,75,000
వైఎస్సార్ ఆసరా	509	రూ.86,75,232
డ్వాక్రా సంఘాలకు సున్నావడ్డీ	615	రూ.72,12,205
వైఎస్సార్ కాపునేస్తం	71	రూ.32,55,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3	రూ.75,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	166	రూ.56,43,799
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	94	రూ.58,76,675
హౌసింగ్	64	రూ.81,80,649
వైఎస్సార్ బీమా	19	రూ.24,79,999
వైఎస్సార్ వాహనమిత్ర	49	రూ.16,90,000
జగనన్న చేదోడు	19	రూ 4,50,000
రైస్ కార్డుదారులక్కు ప్రత్యేక కోవిడ్ సహాయం	719	రూ.7,19,000
జగనన్న తోడు (వడ్డీ)	42	రూ.24,428

మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి..



గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు జరిగాయి. కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకోగలిగాం. అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సచివాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు గ్రామంలోనే అందుతున్నాయి.

– అల్లం సత్యనారాయణ, రెల్లి గ్రామ సర్పంచ్

మా ఇళ్లకు సీసీ రోడ్డు వేశారు..



మాది గిరిజన గ్రామం. కొండ పక్కన నాలుగు కుటుంబాలు నివసిస్తున్నాయి. మా ఇళ్లకు సీసీ రోడ్డు వేశారు. పథకాలు, పింఛన్ డబ్బులు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– వంగలి అప్పలకొండ, అప్పన్నదొరపాలెం గ్రామం

మోసగించడం చంద్రబాబు నైజం

- వలంటీర్ వ్యవస్థపై కూటమి నాయకుల కుట్ర
- సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ



బొండపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం టీడీపీ అధినే త చంద్రబాబునాయుడుకు అలవాటేనని, అది ఆయన నైజమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. గరివిడి మండ లంలోని బొండపల్లి, గొట్నంది గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వీరికి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడు తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి వద్దే పింఛన్ అందేదన్నారు. చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు తమ కుటిల రాజకీయ ఆలోచనలతో వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఇంటి వద్ద పింఛన్లు అందనీయకుండా చేశారని మండిపడ్డారు. పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన పని లేదని మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని, రెండు నెలల తర్వాత వలంటీర్లు ఎప్పటిలాగే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తారని చెప్పారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేశా రని మంత్రి బొత్స అన్నా రు. ఈ అయిదేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని, ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, రైతులకు ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోనే అందిస్తున్నామని వివరించారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చామని చెప్పారు. పేద పిల్లల కోసం సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టారని అన్నారు. సంక్షేమం,అభివృద్ధి రెండుకళ్లగా భావించి పాలన సాగించిన సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమయం కావడంతో గ్రామాల్లోకి టీడీపీ నాయకులు వస్తారని, ఓట్లు అడగుతారని, అధికారంలో ఉన్నప్పుడు ఏ అభివృద్ధి పనులు చేశారో, మీ కుటుంబాలకు ఏం మేలు చేశారో చెప్పాలని వారిని ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అన్ని వర్గాలకూ మేలు చేశాం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలోనే చీపురుపల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. టీడీపీ నాయకుల బూటకపు హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

పేదలకు మంచి జరిగితే సహించలేకపోతున్నారు..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాల ద్వారా పేదలకు మంచి జరుగుతుంటే టీడీపీ నాయకులు సహించలేకపోతున్నారని మండిపడ్డారు. చంద్రబాబునాయుడుకు మాయ,మోసం చేయడం బాగా తెలుసని, 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ మోసం చేసేందుకు బూటకపు హామీలు ఇస్తున్నారని, చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఈ నియోజకవర్గ ప్రజలు, రైతులకు తాగునీరు,సాగునీరు అందించిన ఘనత మంత్రి బొత్సదేనని అన్నారు. ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు జి.రామకృష్ణరాజు, జి.శ్రీరాములనాయుడు, స్థానిక సర్పంచ్‌లు సాకేటి స్వప్న, లోపింటి రాంబాబు, ఎంపీటీసీ లోచర్ల రాములప్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లిలో మంత్రి బొత్స,ఎంపీ బెల్లానకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇబ్బంది పెట్టడమే టీడీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందుకునే అవ్వాతాతలు, వితంతువులను ఇబ్బంది పెట్టడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే పింఛన్లు పంపిణీ చేయగా.. వారి మీద ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన చంద్రబాబును ప్రజలు క్షమించరన్నారు. వలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచీ గుర్రుగా ఉన్న చంద్రబాబు ఎన్నికల సమయంలో తన అనుచరుడు, ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌తో ఫిర్యాదు చేయించడం సిగ్గుచేటన్నారు. అవ్వాతాతలు కార్యాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే టీడీపీ నాయకులు ఇబ్బందులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగ సురేష్, కర్రి రామునాయుడు, కనకల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలం లోని మంగళపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పథకాలు అందించామని, అవినీతి రహిత పాలన అందించామని చెప్పారు.ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, విశాఖపట్నం ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, సర్పంచ్ ఐతంశెట్టి దుర్గ, ఎంపీటీసీ ఐతంశెట్టి నాగమణి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను,నాయకులు కోరుబిల్లి స్వామినాయుడు, అమ్మ శ్రీనివాసరావు, ఐతంశెట్టి అనిల్‌కుమార్, పల్లా భీష్మ, మేలాస్త్రి అప్పారావు,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భద్రకాళి, మజ్జిగౌరి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో భద్రకాళి,మజ్జిగౌరి ఆలయం వద్ద అమ్మవార్ల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి కుటుంబ సభ్యులు ఉదయం తొలిపూజ చేశారు. అనంతరం చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవార్లకు చీర, చారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆంజనేయ స్వామి తీర్థం

జామి: విజినిగిరి గ్రామంలో భక్తంజానేయస్వామి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.ఎడ్ల బళ్ల పోటీలు, ట్రాక్టర్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: మండల కేంద్రంలోని బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గొల్లలపేట, గెద్దపేట గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

చీపురుపల్లి: స్థానిక జి.బి.ఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్ లో ప్రవేశం కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి ఆదివా రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26న పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో రోజూ ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



బొండపల్లి: రోళ్లవాకలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు



మెరకముడిదాం: పులిగుమ్మిలో ప్రజలకు ఎన్నికల నిబంధనలను వివరిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు



జామి: గొడికొమ్ములో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వీరబాబు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు. ఎన్నికల కోడ్‌పై బొండపల్లి మండలంలోని రోళ్లవాకలో ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, జామి మండలంలోని గొడికొమ్ములో ఎస్‌ఐ వీరబాబు, మెరకముడిదాం మండలంలోని పులిగుమ్మిలో బుధరాయవలస ఎస్‌ఐ జి.లోకేశ్వరరావు, దత్తిరాజేరు మండలంలోని పాచలవలవలసలో ఎస్.భూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడా రాజకీయ పార్టీల జెండాలు, బ్యానర్లు కట్టకూడదని,ర్యాలీలు నిర్వహించకూడదని చెప్పారు. గొడవలు సృష్టించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

–బొండపల్లి/జామి/మెరకముడిదాం/దత్తిరాజేరు